క్లుప్తంగా

ఏఎస్సైగా బాధ్యతల స్వీకరణ

మోపాల్: మోపాల్ ఏఎస్సైగా బదిలీపై వచ్చిన నాగభూషణం గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇందల్వాయి నుంచి బదిలీపై మోపాల్‌కు వచ్చారు. ఇక్కడ ఏఎస్సైగా విధులు నిర్వర్తించిన రమేష్ బాబు మాక్లూర్‌కు బదిలీపై వెళ్లారు.

డిష్ కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లతో సమావేశం

సుభాష్‌నగర్: నగరంలో డిష్ కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లతో టౌన్–1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్, టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. డిష్ కేబుళ్లు, ఇంటర్నెట్ కేబుళ్ల కోసం నగరంలో ఎన్ని స్తంభాలను ఉపయోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉమ్మడిగా తనిఖీ చేపట్టారు. ఎన్ని స్తంభాలను ఉపయోగిస్తున్నారు.. కండక్టర్ల నుంచి 6 అడుగుల దిగువన స్తంభాలపై అనుసంధానం చేసిన బహుళ వైర్లను బంచ్ చేయడానికి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామని వారు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సమావేశం ఏర్పాటుచేసి, తనిఖీ చేశామన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



మోపాల్: ముదక్‌పల్లిలో అనారోగ్యంతో మృత్యువాత పడిన గోమాతకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. గోమాత కళేబరాన్ని ట్రాక్టర్‌పై ఉంచి దప్పు వాయిద్యాలతో శ్మశాన వాటిక వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. సంప్రదాయ రీతిలో గోమాతను ఖననం చేసి కన్నీళ్లతో వీడ్కోలు పలికారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

నిజామాబాద్ సిటీ: బల్దియాలోని పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం జిల్లాకేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, పంటి, కంటి పరీక్షలు నిర్వహించారు. కొందరికి అవసరమైన మేరకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే ప్రతి కార్మికుడు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్,సూపర్‌వైజర్ సాజిద్‌అలీ, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి



మోపాల్: విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని డీఈవో అశోక్ సూచించారు. 2025–26 సంవత్సరంలో పదవ తరగతి చదివే విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు గణితంపై ఆన్‌లైన్ క్లాసులను డీఈవో నిర్వహించారు. ప్రతి రోజు 500కుపైగా విద్యార్థులు ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యారు. గురువారం బోర్గాం (పి) పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులపై పరీక్షలు నిర్వహించారు. సెలవుల్లోను డీఈవో స్వయంగా గణితంపై ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు డీఈవోను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం శంకర్, హెచ్‌ఎంలు మధుసూదన్, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 ఖలేజా-10.25, 4.30
భైరవం-1.30, 7.35, 10.35
స్క్రీన్-2 ఖలేజా-1.30, 7.35, 10.35
షష్టిపూర్తి-4.35
స్క్రీన్-3 లవ్‌కరో యా(హిందీ)-11.00, 4.30
నరివెట్ట-1.30 -సింగిల్-7.30 -షష్టిపూర్తి-10.20
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 మిషన్ ఇంపాజిబుల్(ఇంగ్లీష్)-10.55, 7.20
కరాటే కిడ్ లీడర్స్-2.25 భూల్ చుక్ మాఫ్(హిందీ)-4.40, 10.50
స్క్రీన్-2 భూల్ చుక్ మాఫ్(హిందీ)-11.00
సింగిల్-1.40, 7.35 - భైరవం-4.25,10.20
స్క్రీన్-3 కరాటే కిడ్ లీడర్స్-11.25,
షష్టిపూర్తి-1.40
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-2.15
హిట్(తెలుగు)-4.45- సింగిల్-4.50
కరాటే కిడ్ లీడర్స్(ఇంగ్లీష్)-7.45, 10.00
స్క్రీన్-4 ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-11.05, 4.15, 10.20
శుభం-1.35 -ఖలేజా-6.45
లలితామహల్ భైరవం దేవి కరాటే కిడ్ లీడర్స్
నటరాజ్ కేసరి చాప్టర్ విజయ్ ఖలేజా

వెలెనెస్ వెతలు | తీరేదెన్నడో...?

- అరకొర వసతుల మధ్య సెంటర్ కొనసాగింపు
- తీవ్రంగా వేధిస్తోన్న మందుల కొరత
- పట్టించుకోని ప్రభుత్వం



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న వెల్‌నెస్ సెంటర్

నిజామాబాద్‌నాగారం : కామారెడ్డి, నిజామాబాద్ ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డు ఎంప్లాయిస్, జర్నలిస్టులు వారి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం వెల్నెస్ సెంటర్‌ను 2017లో ఏర్పాటు చేసింది. మొదట్లో సంతృప్తికరమైన వైద్య సేవలు అందడంతో ఎక్కువ సంఖ్యలో రోగులు చికిత్స కోసం వచ్చేవారు. పాత కలెక్టరేట్‌లో వెల్‌నెస్ సెంటర్ ఉండేది. దాన్ని కూల్చడంతో అరకొర వసతుల మధ్య జీజీహెచ్‌లో ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర తర్వాత మున్సిపాల్ కార్యాలయ ఆవరణలోకి మార్చారు. ఇక్కడ కూడా అదే పరిస్థితిలో కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెల్నెస్‌లో మార్పులు జరుగుతాయని భావించారు. కానీ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

కలెక్టర్ పర్యటించినా మార్పు రాకపాయే..

వెల్నెస్ సెంటర్‌లో సమస్యలు తెలుసుకోవడానికి ఇటీవల కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పర్యటించారు. ఏ సమస్యలు ఉన్నాయో వైద్యులు, రిటైర్డు ఉద్యోగుల ద్వారా తెలుసుకున్నారు. కలెక్టర్ వచ్చి పరిశీలించినా మార్పు రాకపోవడంతో రిటైర్డు ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు ఆవేదన చెందుతున్నారు.

లబ్ధిదారులు	జిల్లా	సంఖ్య
రిటైర్డ్ ఉద్యోగులు	నిజామాబాద్	11,000
	కామారెడ్డి	8,000
ఉద్యోగులు	నిజామాబాద్	10,000
	కామారెడ్డి	6,000
టీచర్లు	నిజామాబాద్	8,000
	కామారెడ్డి	4,000
జర్నలిస్టులు	ఉమ్మడి జిల్లా	1,500

నామమాత్రంగా వైద్య సేవలు

ప్రస్తుతం ఇద్దరు, ముగ్గురు వైద్యులు నామమాత్రపు వైద్య సేవలు అందిస్తున్నారు. స్పెషాలిటీ వైద్యులు, ఎండీ వైద్యులు లేరు. ఎంబీబీఎస్ చేసిన వారే చికిత్స అందిస్తున్నారు. ప్రతి నిత్యం 60 నుంచి 80కి పైగా రోగులు వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. అంతేకాక సరైన వసతి లేని కారణంగా డెంటల్, ఈసీజీ, ఫిజియోథెరపీ లాంటి సేవలు నిలిపేశారు. సెంటర్‌లో రెండు నెలలుగా మందులు అందుబాటులో లేవు. సుదూర ప్రాంతాల నుంచి మందుల కోసం వచ్చిన సీనియర్ సిటిజన్లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న మందులు ఇచ్చి పంపించేస్తున్నారు.

బీపీ, షుగర్ గోలీలు కూడా లేవు



వెల్‌నెస్ సెంటర్‌లో వసతి లేని కారణంగా అనేక సర్వీసులు నిలిపేశారు. డెంటల్, ఈసీజీ, ఫిజియోథెరపి తదితర సామగ్రి మూలకు పడ్డాయి. మందుల కొరత తీవ్రంగా ఉంది. బీపీ, షుగర్, కార్డియాలజీ, తదితర ప్రాథమికమైన మందులు కూడా అందుబాటులో లేవు. మందులు లేక బయట కొనుక్కోవాల్సి పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించాలి.

– కె.రామ్మోహన్ రావు, జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ యూనియన్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

- కుంటిసాకులు వద్దు
- జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బల్మూరి

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, విబేధాలు పక్కనపెట్టి ఏకతాటిపై నడవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి గోనెరెడ్డి కల్యాణ మండపంలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 22 డివిజన్లకు చెందిన స్థానిక నేతలతో డివిజన్ల వారీగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొందరు పార్టీ బలహీనంగా ఉందని మాట్లాడటం సబబు కాదని సూచించారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నాయని ఇప్పటివరకు కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో లేనన్ని సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తుంటే వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని అందరికి సమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

2017కు ముందు పార్టీలో ఉన్నవారికే..

2017 డిసెంబర్‌కు ముందు పార్టీలో ఉన్నవారికి మాత్రమే పదవులు వస్తాయని బల్మూరి తెలిపారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి కూడా సముచిత స్థానం ఉంటుందని, వారి సేవలను సైతం వినియోగించుకుంటామన్నారు. ప్రతి డివిజన్‌లో సమస్యలు చెప్పడం కాకుండా ఏం చేస్తే ప్రజల్లోకి బలంగా వెళతామో సూచించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, మెజార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ దక్కించుకోవాలని సూచించారు. ఇదే అజెండాగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. ముందుగా డివిజన్ అధ్యక్షులను నియమిస్తున్నామని, అందరిని కలుపుకునిపోయే వారి పేర్లు నగర అధ్యక్షుడు కేశ వేణుకు అందించాలని కోరారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్, నాయకులు జావెద్ అక్రం, రాంభూపాల్ రెడ్డి, రత్నాకర్, వేణురాజ్, బొబ్బిలి రామకృష్ణ, గోపి, శ్రీశైలం, విజయపాల్‌రెడ్డి,తదితరులున్నారు.

నియామకం

నిజామాబాద్‌నాగారం: ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమావత్ మోహన్ నాయక్, కార్యదర్శిగా కేతావత్ పీర్‌సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీహరి నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఇందులో మాజీ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్, విఠల్‌నాయక్, శంకర్‌నాయక్, బన్సీనాయక్, ఇందల్‌నాయక్, రాజశేఖర్, గౌతమ్ తదితరులున్నారు.

పూరి జగన్నాథ్ మండప నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి

సుభాష్‌నగర్: నగరంలోని పాత గంజ్‌లో 8వ జగన్నాథ రథయాత్ర, భాగవత సప్తాహ ఉత్సవాల సందర్భంగా పూరి జగన్నాథ్ మండప నిర్మాణ పనులను నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. ఇస్కాన్ నిజామాబాద్(ద్వారకానగర్) ఆధ్వర్యంలో జూన్ 20 నుంచి 27 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. మండప నిర్మాణ పనులు తన చేతుల మీదుగా ప్రారంభం కావడం అదృష్టంగా భావిస్తున్నానని, ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇస్కాన్ నిజామాబాద్ అధ్యక్షుడు శ్రీమాన్ సిద్ధ బలరాం దాస్, సెలక్షన్ గ్రేడ్‌సెక్రటరీ అపర్ణ, గ్రేడ్–2 సెక్రటరీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



అమృతాపూర్‌లో ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నేత గంగాధర్



రావుట్లలో మంజూరు పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొండాపూర్‌లో..

డిచ్‌పల్లి: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకే తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అన్నారు. గురువారం అమృతాపూర్‌లో ఏడుగురు లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులకు ఆయన ముగ్గు వేసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలిన 16 మంది లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని కోరారు. మాజీ వైస్ ఎంపీపీ దండుగుల సాయిలు, డీసీసీ డెలిగేట్ ధర్మాగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సయ్య, గంగాధర్ గౌడ్, కార్యదర్శి భూలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

సిరికొండ: రావుట్ల, కొండాపూర్, జగదాంబ తండాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. రావుట్లలో డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, రమేష్, సామేల్, నాని, లింగం, ప్రసాద్, భాస్కర్, గంగారెడ్డి, దాసు, శివాజీ, కొండాపూర్‌లో గ్రామ శాఖ అధ్యక్షుడు బుచ్చన్న, జగన్, శ్రీధర్, గౌస్, చంద్రాగౌడ్, ఫారూఖ్, ఎల్లయ్య, జగదాంబతాండలో రవినాయక్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



మాక్లూర్: ప్రకృతివనాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

నవీపేట/నందిపేట/మాక్లూర్/డొంకేశ్వర్: నవీపేట మండలం జన్నేపల్లిలో, నందిపేట మండలం ఆంధ్రానగర్‌లో, మాక్లూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కేంద్ర సర్వీస్‌లోని వివిధ శాఖల ప్రతినిధులు పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గ్రామంలో అందుతున్న కేంద్ర ప్రభుత్వ వైద్య సేవలపై ఆరా తీశారు. 2018 నుంచి అందించిన కోవిడ్ వ్యాక్సిన్‌పై విచారించారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఐకేపీ, ఐసీడీఎస్, విద్య, వైద్యం, వ్యవసాయ శాఖల పనితీరు గురించి తెలుసుకున్నారు. అలాగే గ్రామస్థాయిలో పరిపాలన గురించి విచారించారు. ప్రకృతివనాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం డొంకేశ్వర్ మండలం చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నప్పటి నుంచే దేశభక్తి అలవర్చుకోవాలి



క్రీడాకారులతో ఒలింపిక్ సంఘం జిల్లా ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: పిల్లలు చిన్నప్పటి నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య పేర్కొన్నారు. ఆర్మీ జవాన్ మురళి నాయక్ స్మారకార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మైదానంలో గురువా రం నిర్వహించిన అండర్–14 క్రికెట్ టోర్నీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సరిహద్దులో విధులు నిర్వహిస్తూ ముష్కరుల దాడిలో ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మురళి నాయక్ స్మారకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆటలతోపాటు దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వీర జవాన్లను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు రేపల్లె శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.



జిల్లాలో ఖరీఫ్ పంటలు అంచనాకు మించి సాగయ్యాయి. దీంతో ఎరువులను అధికారులు జిల్లాకు పెద్దఎత్తున తెప్పించారు. గురువారం రైల్వే స్టేషన్లో గూడ్స్ బోగీల నుంచి ఎరువులను లారీలో ఎక్కిస్తుండగా తీసిందీ చిత్రం. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

డిచ్‌పల్లి: నిత్యం యోగా ఆచరించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఆయుష్ ఇన్‌స్ట్రక్టర్లు ఓంసాయి, స్వప్న పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డిచ్‌పల్లిలోని ఆయుష్ చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్టర్లు గురువారం మానవతాసదన్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా ద్వారా శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారని తెలిపారు. ఏకాగ్రత ఎలా పెంచుకోవాలి, మనస్సును ఎలా అదుపులో పెట్టుకోవాలనే అంశాలను వివరించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఓంసాయి, స్వప్న తెలిపారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోండి



నిజామాబాద్ అర్బన్: నగరంలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని గురువారం టీజీవీపీ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టిందని, దీనిపై పరిశీలన చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు సుమారు 400పైగా అడ్మిషన్లను నిర్వహించారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని తక్షణమే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. టీజీవీపీ నాయకులు బొబ్బిలి కళ్యాణ్, జిల్లా కార్యకర్తలు మహేష్, యశ్వంత్, ధర్మేందర్, మహేష్ తదితరులున్నారు.

రైతులకిచ్చే మద్దతు ధర పెంచాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నిజామాబాద్ సిటీ: పంటల మద్దతు ధర పెంచాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో వేల్పూరు భూమయ్య మాట్లాడుతూ.. వ్యవసాయంలో పంటల పెట్టుబడి ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయని, సంవత్సరానికి 10 నుంచి 12 శాతం పెరుగుతున్నాయని అన్నారు. కానీ మద్దతు ధరలు మాత్రం 3 శాతానికి మించి పెరగడం లేదన్నారు. మద్దతు ధర నిర్ణయించడంలో ప్రభుత్వాలు తప్పిదాలు చేశాయని, కనీసం స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు పరచడం లేదన్నారు. ఈ ఏడాడి రైతులకు సరిపడా నాణ్యమైన సరఫరా చేయాలని, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు దేశెట్టి సాయరెడ్డి, బి.సాయిలు, గంగాధర్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,300	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	88,892	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	150	200	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	30	50
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	90	మామిడికాయ	40	60

–సుభాష్‌నగర్

శంకరయ్య త్యాగం వెల కట్టలేనిది



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి

నిజామాబాద్ లీగల్: తొలి తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన పెద్ద శంకరయ్య మలి విడత ఉద్యమానికి ఆదర్శప్రాయుడని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి అన్నారు. శంకరయ్య వర్ధంతి సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత బహుజన సంఘం ఆధ్వర్యంలో నగరంలోని సామాజిక సంస్కర్తల విగ్రహాల ప్రాంగణంలో శంకరయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాయిరెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 1969లో హైదరాబాదులోని అఫ్జల్ గంజ్‌లో జరిగిన పోలీస్ కాల్పుల్లో ప్రాణాలు విడిచిన శంకరయ్య ఎందరో తెలంగాణ యోధులకు ఆదర్శప్రాయుడిగా నిలిచారని గుర్తు చేశారు. దళిత కుటుంబం నుంచి వచ్చిన ఆయన తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అని, మలిదశ ఉద్యమానికి ప్రేరక శక్తి గా నిలిచిందన్నారు. శంకరయ్య అమరుడయ్యాక ఆయన కుటుంబం పాలమూరు జిల్లా నుంచి వచ్చి నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం నెహ్రూనగర్‌లో స్థిరపడిందని గుర్తు చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దిలీప్ మాట్లాడుతూ ..శంకరయ్య అమరత్వం అజరామరమని అన్నారు. దళిత బహుజన సంఘం అధ్యక్షుడు జ్యోతి రాజు ఆధ్వర్యంలో జరిగిన సభలో న్యాయవాదులు ఆశా నారాయణ, అన్వేష్, ఆరేటి నారాయణ, భారత్ లైబ్రరీ కార్యదర్శి శ్రీమన్, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్ రాజ్, బాలకృష్ణ గౌడ్, భాస్కర్ గౌడ్, తదితరులున్నారు.